## క్లుప్తంగా

### శాకంబరీదేవిగా కాశీఅన్నపూర్ణ



మధురానగర్(విజయవాడ సెంట్రల్): అజిత్ సింగ్‌నగర్ ఆంధ్రప్రభ కాలనీ సాయిబాబా మందిరంలోని శ్రీ కాశీ అన్నపూర్ణ అమ్మవారు గురువారం శాకంబరీదేవి అలంకారంలో భక్తుల పూజలు అందుకున్నారు. ఆషాఢ మాసం ఏకాదశి పర్వదినం సందర్భంగా శ్రీ సాయి ప్రభ సేవా ట్రస్ట్ ఆధ్వర్యాన అమ్మవారిని వివిధ రకాల కాయగూరలతో శాకంబరీదేవిగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమాలను శ్రీ సాయి ప్రభ సేవా ట్రస్ట్ సభ్యులు పర్యవేక్షించారు.

### 17 నుంచి శ్రీ మహావిష్ణు సహస్రనామ పారాయణం

విజయవాడ కల్చరల్: శృంగేరీ శారదా పీఠం ఆధ్వర్యంలో 17వ తేదీ నుంచి నెల రోజుల పాటు శివరామకృష్ణ క్షేత్రంలో నిత్యం సాయంత్రం శ్రీ మహావిష్ణు సహస్రనామ పారాయణం జరుగుతుందని ధర్మాధికారి శిష్టాల హనుమత్ ప్రసాద్ తెలిపారు. ఆయన గురువారం దేవాలయంలో విలేకరులతో మాట్లాడారు. జగద్గురువులు భారతీ తీర్థ మహాస్వామి ఆదేశంతో ఈ పూజలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. 17వ తేదీ సాయంత్రం నగర సంకీర్తన, శ్రీ మహావిష్ణువు ఉత్సవ మూర్తుల ఊరేగింపు, 18వ తేదీ నుంచి లక్షతులసీ అర్చన నిర్వహిస్తామని వివరించారు.

### చురుగ్గా రోడ్డు సెక్షన్ పనులు



మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 30వ డివిజన్ గద్దే వెంకట్రామయ్యనగర్ దావు బుచ్చయ్యకాలనీ రోడ్డు సెక్షన్ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. జోరు వానలో సైతం రోడ్డు పనులను జేసీబీ సహాయంతో చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతల పడ్డ రోడ్డును సరిచేయటంతో పాటు ప్రజల రాకపోకలకు అనుగుణంగా రోడ్డును విస్తరిస్తున్నారు.

### మురళి కుటుంబానికి ఎమ్మెల్యే విష్ణు పరామర్శ



పాయకాపురం(విజయవాడరూరల్): వైఎస్సార్ సీపీ 61వ డివిజన్ సీనియర్ నాయకుడు వియ్యపు మురళి (40) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఏపీ ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఈ సమాచారం తెలుసుకుని మురళి నివాసానికి వెళ్లి ఆయన భౌతిక కాయం వద్ద నివాళులర్పించారు. మురళి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఉమ్మడి వెంకట్రావ్, జిల్లా కార్యదర్శి అవుతు శ్రీనివాసరెడ్డి, నగర ప్రధాన కార్యదర్శి అలంపూరు విజయ్, డివిజన్ కోఆర్డినేటర్ నాలం బాబు, బత్తుల దుర్గారావు, బెవర నారాయణ తదితరులు మురళి భౌతిక కాయం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు.

### వార్డు వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని ఆయా డివిజన్లలో వార్డు వలంటీర్లుగా సేవలు అందించేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 35 ఏళ్లలోపు వయసు ఉండి, పదో తరగతి విద్యార్హత ఉన్న అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 22వ తేదీలోపు హెచ్‌టీటీపీ://40.81.241.107/ఏపీవలంటీర్20/ఏపీవలంటీర్090420201049.వీటీ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు వీఎంసీ అదనపు కమిషనర్(ప్రాజక్ట్స్) వార్డు సెక్రటేరియట్ స్పెషల్ సెల్ (81859 33187)లో సంప్రదించాలని పేర్కొన్నారు.

### మానసాదేవికి ఆషాఢం సారె సమర్పణ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆషాఢ మాసం సందర్భంగా లెనిన్ సెంటర్‌లోని శ్రీనాగసాయిబాబా–నాగమానసాదేవి మందిరంలో గురువారం భక్తులు సాగమానసాదేవి అమ్మవారికి సారె సమర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి పిండివంటలు నైవేద్యం పెట్టారు. యాలకుల దండను అమ్మవారి మెడలో వేసి అలంకరించారు. ప్రతి ఒక్కరిని చల్లగా చూడాలని, మంచి జరగాలని అమ్మవారిని వేడుకున్నారు. మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి ఆధ్వర్యంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది.

# పేదల అభ్యున్నతే ధ్యేయంగా పాలన

**ఎమ్మెల్యే మల్లాది విష్ణు**



స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): పేదల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. నాలుగేళ్ల పాలనలో అన్ని వర్గాలకు న్యాయం చేశామని పేర్కొన్నారు. 59వ డివిజన్ 254వ వార్డు సచివాలయం పరిధిలో గురువారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఎండీ షాహీనా సుల్తానాతో కలిసి ఆయన పాల్గొన్నారు. జోరు వానలోనూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగారు. ప్రజలతో మమేకమై స్థానిక సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి ప్రజలకు జరిగిన లబ్ధిని వివరించారు.

**70 పనులకు రూ.14 కోట్లు**

సెంట్రల్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 74 వార్డు సచివాలయాల పరిధిలో గడప గడపకు కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తిచేశామని ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి సంబంధించి 70 పనులకు రూ.14 కోట్ల మంజూరయ్యాయని పేర్కొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

**పేదలకు మేలు**

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకునే ప్రతి నిర్ణయం లక్షల మంది పేదల జీవితాల్లో నూతన వెలుగులు ప్రసరింప చేస్తోందని మల్లాది విష్ణు అన్నారు. తెలుగుదేశం హయాంలో కేబినెట్ నిర్ణయాలు కేవలం అనుయాయులు, వందిమాగధులకు దోచిపెట్టడం కోసమే జరిగేవని విమర్శించారు. 54 వేల ఎకరాలను భూమిలేని దళిత, బడుగు, బలహీన వర్గాలకు చెందిన 46,935 మంది నిరుపేదలకు పంపిణీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం శుభ పరిణామమన్నారు. లంచాలకు అలవాటుపడి, నిండా అవినీతిలో కూరుకుపోయిన గత తెలుగుదేశం పాలకులు ఇటువంటి నిర్ణయాలు తీసుకోలేకపోయినందుకు సిగ్గుపడాలన్నారు.

**అర్చకులకు నో రిటైర్మెంట్ హర్షణీయం**

అర్చకులకు రిటైర్మెంట్ లేకుండా చట్ట సవరణకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపడం హర్షణీయమని మల్లాది విష్ణు అన్నారు. పేద అర్చకుల ప్రతి ఒక్క న్యాయబద్ధమైన డిమాండ్లను ఈ ప్రభుత్వం చిత్తశుద్ధితో పరిష్కరిస్తోందని చెప్పారు. టీడీపీ హయాంలో అర్చకులకు వంశపారపర్య హక్కులు కల్పించాలని అడిగితే, గొంతెమ్మ కోర్కెలు వద్దని ఆ నాడు చంద్రబాబు అవమానించారని గుర్తుచేశారు. బ్రాహ్మణ కార్పొరేషన్‌ను పూర్తిగా నిర్వీర్యం చేసి, పేద అర్చక, పురోహితుల గొంతు కోశారని విమర్శించారు. మరలా ఏ ముఖం పెట్టుకుని టీడీపీ నాయకులు మాట్లాడతారని ధ్వజమెత్తారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత బ్రాహ్మణులపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారని మల్లాది విష్ణు అన్నారు. అర్చకుల వంశపారంపర్యంపై నాడు వైఎస్ రాజశేఖరరెడ్డి గారు తెచ్చిన జీవోను సవరించి అమల్లోకి తెచ్చారని పేర్కొన్నారు. మరోవైపు వలంటీర్ల వ్యవహారంలో పవన్ కల్యాణ్‌కు స్క్రిప్ట్ అందించి, చంద్రబాబు బోద్యం చూస్తున్నారని మల్లాది విష్ణు ఆరోపించారు. బాధ్యతాయుతమైన ప్రతిపక్ష నేతగా పవన్ వ్యాఖ్యలపై చంద్రబాబు స్పందించాలని డిమాండ్ చేశారు. డీఈ రామకృష్ణ, ఏఎంఓహెచ్ డాక్టర్ రామకోటేశ్వరరావు, సీడీఓ జగదీశ్వరి, నాయకులు హఫీజుల్లా, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# అసైన్డ్ భూములపై హక్కుల కల్పన చారిత్రాత్మకం



అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వెలంపల్లి

భవానీపురం(విజయవాడపశ్చిమ): మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి తరువాత మళ్లీ భూ పంపిణీకి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్రంలో భూమి లేని దళిత, బడుగు బలహీనవర్గాలకు చెందిన 46,935 మంది నిరుపేదలకు పంపిణీ చేసేందుకు బుధవారం కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పోలిమెట్ల శరత్ బాబు ఆధ్వర్యంలో గురువారం తుమ్మలపల్లి కళాక్షేత్రం ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ముఖ్యఅతిథి వెలంపల్లి మాట్లాడుతూ.. అసైన్డ్ భూములు పంపిణీ చేసిన 20 ఏళ్ల తరువాత ఆ భూమిపై సంబంధిత రైతులు, వారి వారసులకు పూర్తి యాజమాన్య హక్కులు కల్పిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో దాదాపు 22 లక్షల మంది బడుగు, బలహీనవర్గాలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. రెండు దశాబ్దాల అనంతరం వారందరికీ పట్టా భూముల మాదిరిగానే అసైన్డ్ భూముల క్రయ, విక్రయాలకు అవకాశం ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల ప్రజలకు మేలు చేసిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు.

**దశాబ్దాలుగా ఎస్సీలు ఎదురు చూస్తున్నారు**

మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. అసైన్డ్ భూములు పొందిన ఎస్సీలు వాటిపై యాజమాన్య హక్కుల కోసం కొన్ని దశాబ్దాలుగా ఎదురు చూస్తున్నారని, అది ఇప్పుడు సీఎం జగన్ తీసుకున్న నిర్ణయంతో సాకారమయ్యిందని తెలిపారు. పేదల సంక్షేమానికి పాటుపడ్డ తన తండ్రి వైఎస్సార్ కంటే రెండడుగులు ముందుకేస్తానన్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్న మాటను నిలబెట్టుకున్నారని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నాయకులు చందా కిరణ్, బూదాల శ్రీను, మధిర ప్రభాకర్, నత్త యోనరాజు, యర్రజొన్న విజయలక్ష్మి, తాండ్ర ఇంద్ర, కామళ్ల జోజి, నాగెళ్ల సంగీత్ బాబు, చేపూరి శ్రీను, వి.థామస్, వై.శ్యామ్, సుబ్బారావు, కట్టా సత్తెయ్య, కార్పొరేటర్లు బాపతి కోటిరెడ్డి, యలకల చలపతిరావు, శిరంశెట్టి పూర్ణ, పార్టీ నాయకులు మైలవరపు దుర్గారావు, వెన్నం రజని, పణుకు ఫణి, శేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వివాహ ఆభరణాల ప్రదర్శన



లబ్బీపేట(విజయవాడతూర్పు): పీఎంజే జ్యూవెల్స్ వివాహ ఆభరణాలు సితార కలెక్షన్స్ ప్రదర్శన గురువారం నగరంలోని హోటల్ గేట్‌వేలో ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరగనున్న ఈ ప్రదర్శనను దేవినేని అనుపమ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ప్రదర్శనలోని నెక్లెస్‌లు, చెవి పోగులు, గాజులు, ఉంగరాలు, పొల్కాలో పాటు నాణ్యమైన డైమండ్స్ అలంకరించిన ఆభరణాలు, విలువైన లోహాలతో రూపొందించిన అరుదైన అభరణాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. సితార కలెక్షన్స్‌ను విజయవాడలోని ఆభరణాల ప్రియుల కోసం ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు పీఎంజే విజయవాడ స్టోర్‌హెడ్ మోహనకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో సౌత్ ఇండియా బిజినెస్ హెడ్ హైదర్ అలీ పాల్గొన్నారు.

## పవన్ కల్యాణ్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలి



పవన్ కళ్యాణ్ చిత్రపటాన్ని దగ్ధం చేస్తున్న వలంటీర్లు

పాయకాపురం(విజయవాడరూరల్): జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ తమపై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్త 64వ డివిజన్లో సచివాలయాల వలంటీర్లు గురువారం నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పవన్‌కల్యాణ్ చిత్రపటాన్ని దగ్ధం చేశారు. 281వ సచివాలయం నుంచి ప్రారంభమైన నిరసన ర్యాలీ కండ్రిక మెయిన్ రోడ్డు నుంచి కండ్రిక –నూజివీడు ఆర్‌అండ్‌బీ రహదారి వరకు సాగింది. డౌన్ డౌన్ పవన్ కల్యాణ్ అంటూ వలంటీర్లు నినాదాలు చేశారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ సేవలు అందిస్తున్న తమపై అసభ్య వ్యాఖ్యలు చేసిన పవన్‌కల్యాణ్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం నూజివీడు రోడ్డులోని కండ్రిక సర్కిల్‌లో మానవహారం నిర్మించి, పవన్ కల్యాణ్ చిత్రపటాలను తగులబెట్టారు.

**రాజకీయాలకు పనికిరాని పవన్ కల్యాణ్**

ఈ సందర్భంగా 64వ డివిజన్ కార్పొరేటర్ యర్రగొర్ల తిరుపతమ్మ మాట్లాడుతూ.. పవన్ కల్యాణ్ రాజకీయాలకు పనిరాడన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న మంచి పనులు చూసి ఓర్వలేక చంద్రబాబు ఆడమన్నట్లు పవన్‌కల్యాణ్ ఆడుతున్నాడని విమర్శించారు. రాజకీయ నాయకుడికి కావాల్సిన లక్షణాలు అతనికి లేవన్నారు. 280, 281, 282, 284, 285 సచివాలయాల వలంటీర్లు, వైఎస్సార్ సీపీ డివిజన్ కోఆర్డినేటర్ ఎస్‌కే ఇస్మాయిల్, అక్కిశెట్టి నారాయణ, ఎస్‌కే బాషా, జనార్దన్, పవన్, మహేష్, డివిజన్ ఇన్‌చార్జి జె.శివ పాల్గొన్నారు.

## రేపు ఉపా చట్టం రద్దు కోరుతూ మహా ధర్నా

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రజా వ్యతిరేకమైన ఉపా చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని, ఉపా కింద అరెస్ట్ చేసిన వారిని విడుదల చేయాలని కోరుతూ ఈ నెల 15న విజయవాడ ధర్నా చౌక్‌లో మహాధర్నా చేస్తామని ఉపా రద్దు పోరాట కమిటీ కో కన్వీనర్ దుడ్డు ప్రభాకర్ తెలిపారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన సమావేశంలో మహాధర్నా పోస్టర్‌ను విడుదల చేశారు. ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పోలారి, పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.ఆంజనేయులు, విరసం నాయకులు అరసవిల్లి కృష్ణ, రివేరా, కుల నిర్మూలన పోరాట సమితి నాయకులు టి.శ్రీరాములు, ఎ.రవిచంద్ర, రామకృష్ణ, పాల్గొన్నారు.

## ఖాతాలో నగదు మాయంపై ఫిర్యాదు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఓ వ్యక్తి బ్యాంక్ ఖాతాలోని నగదు మాయమైందని అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. సింగ్‌నగర్ పైపుల రోడ్డు ప్రాంతానికి చెందిన ఆకురాతి శ్రీనివాసరావు భవానీపురం పైపుల దుకాణంలో పనిచేస్తున్నారు. ఆయనకు సింగ్‌నగర్ పైపులరోడ్డు ఎస్‌బీఐ బ్రాంచిలో ఖాతా ఉంది. కంపెనీ పరంగా అతని ఖాతాలో రూ.80,867 నగదు ఉంది. గత నెల 30వ తేదీ సాయంత్రం 4.30 గంటలకు పైపులరోడ్డులోని ఎస్‌బీఐ ఏటీఎం వద్ద రూ. 2 వేలు విత్‌డ్రా చేశారు. తరువాత ఈ రోజు బ్యాంకుకు వెళ్లి చూడగా అతని ఖాతాలో ఉండాల్సిన రూ.70,867 కనిపించలేదు. దీంతో బ్యాంకు బ్రాంచిని సంప్రదించినా ఎటువంటి సమాధానం లభించలేదు. గురువారం సాయంత్రం అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తాను ఎవరికీ ఎటువంటి ఓటీపీలు చెప్పలేదని, అయినా తన ఖాతాలో నగదు మాయమైందంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు.

## విద్యాశాఖ పరీక్షల విభాగం డైరెక్టర్ దేవానందరెడ్డికి సత్కారం



సత్కారం అందుకుంటున్న దేవానందరెడ్డి

లబ్బీపేట(విజయవాడతూర్పు): జాతీయ విద్యావిధానం 2020 అమలులో భాగంగా పాఠశాలలో జాతీయ క్రెడిట్ ఫ్రేంవర్క్ (ఎన్‌సీఆర్‌ఎఫ్) సబ్ కమిటీ సభ్యులుగా నియమితులైన రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ పరీక్షల విభాగం డైరెక్టర్ డి.దేవానందరెడ్డిని గురువారం నగరంలో ఘనంగా సత్కరించారు. లబ్బీపేటలోని ప్రతిభ కోచింగ్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆ సెంటర్ డైరెక్టర్ జంపాన సుధాకర్‌తో పాటు పలువురు ఘనంగా సత్కరించారు. దేవానందరెడ్డి మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు ఏ విధంగా ప్రణాళికాబద్ధంగా చదవాలి, సమయాన్ని ఎలా వినియోగించుకోవాలో తెలిపారు. తాను ఈ స్థాయికి రావడానికి ఎలా కృషి చేశారో చెప్పారు. కార్యక్రమంలో ఆ సెంటర్ అధ్యాపకులు ఓలేటి నాగార్జున, పిన్నింటి బాలకృష్ణ, రాంబాబు, ధరణి శ్రీనివాస్, జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.

## 35 మందిపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): రోడ్లపై వాహనాల రాకపోకలు, ప్రజలను ఇబ్బందులకు గురి చేసిన జనసేన పార్టీకి చెందిన 35 మందిపై కొత్తపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. గురువారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో జనసేన పార్టీకి చెందిన పోతిన మహేష్, మరో 34 మంది చిట్టినగర్ జంక్షన్‌లో రోడ్డు మధ్యలో బైఠాయించి ప్రజలను ఇబ్బందులకు గురి చేశారు. వాహనాల రాకపోకలను నిలిపివేయడంతో పాటు ప్రజలకు అసౌకర్యం కలిగించడంతో వీఆర్వో కంచెర్ల బాలమ్మ ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు వారిపై కేసు నమోదు చేశారు.

## గంజాయి విక్రేతలు ఇద్దరికి జైలు శిక్ష

విజయవాడ స్పోర్ట్స్: గంజాయి విక్రేతలు ఇద్దరికి కఠిన కారాగార శిక్ష విధిస్తూ విజయవాడ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి వై.శ్రీనివాసరావు గురువారం తీర్పు చెప్పారు. విజయవాడ వన్‌టౌన్ ప్రాంతంలోని రమణయ్య కూల్‌డ్రింక్ షాపు వద్ద కొందరు వ్యక్తులు గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారంతో పోలీసులు దాడిచేశారు. గంజాయి కలిగి ఉన్న కొత్తపేటకు చెందిన అవ్వా శేషు, ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అజయ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. 2022 నవంబర్ 19వ తేదీ జరిగిన ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి ఇద్దరు నిందితులను కోర్టులో హాజరుపర్చారు. ప్రాసిక్యూషన్ తరఫున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.కృష్ణకిషోర్ కోర్టుకు వాదనలు వినిపించారు. ఏడుగురు సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువు కావడంతో అవ్వా శేషుకు ఆరు నెలలు జైలు శిక్ష, అజయ్‌కుమార్‌కు ఒక నెల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

**గంజాయి విక్రేత అరెస్టు**

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): నగరంలో గంజాయి విక్రయిస్తున్న యువకుడిని ఎస్‌ఎన్‌పురం పోలీసులు గురువారం అరెస్టు చేశారు. అతని వద్ద కేజీన్నర గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. సత్యనారాయణపురం శివాలయంవీధికి చెందిన రేగుల తేజ శంకర్ (21) ఇతర ప్రాంతాల నుంచి గంజాయి తీసుకొచ్చి నగరంలో విక్రయిస్తుంటాడు. ఈ సమాచారం పోలీసులకు అందింది. ఎస్‌ఎన్‌పురం ఎస్‌ఐ దుర్గామహేష్ సిబ్బందితో వెళ్లి రైల్వే స్టేషన్ పరిసరాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న తేజశంకర్‌ను అదుపులోకి తీసుకుని అతని వద్ద ఉన్న బ్యాగును సోదా చేయగా గంజాయి లభ్యమైంది. దీంతో అతన్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## ట్రైనీ జేసీలకు రిజిస్ట్రేషన్‌లపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో ట్రైనీ జేసీలు

గుణదల (విజయవాడ తూర్పు): ప్రభుత్వ విధి విధానాలపై అవగాహన కలిగి నిబద్ధతతో పని చేయాలని పటమట సబ్ రిజిస్ట్రార్ వేగే కృష్ణచైతన్య అన్నారు. గుణదల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ట్రైనీ జాయింట్ కలెక్టర్లకు రిజిస్ట్రేషన్ ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్, రెవెన్యూ, అగ్రికల్చర్ వంటి విభాగాల్లో అవగాహన ఉండాలన్నారు. ప్రధానంగా పాలనా అంశాలపై పట్టు సాధించాలన్నారు. ప్రజలకు ప్రభుత్వం అందించే సేవలు, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలని కోరారు. అనంతరం రిజిస్ట్రేషన్ ప్రక్రియలో కీలక అంశాలపై అవగాహన కల్పించారు. విక్రయ దస్తావేజు, తనఖా, జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ వంటి డాక్యుమెంట్ల ఆవశ్యకతను తెలియచేశారు. ఈసీ, నకలు, బుక్ –1,బుక్–4 రిజిస్ట్రేషన్లపై ప్రొజెక్టర్ ప్రజెంటేషన్ అందించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో బస్ రిజిస్ట్రార్‌ల పాత్రను విశదీకరించారు. కక్షిదారులు క్రయ, విక్రయాలు జరుపుకునే సమయంలో ప్రభుత్వానికి చెల్లించాల్సిన స్టాంప్ డ్యూటీని వివరించారు. కార్యక్రమంలో గుణదల సబ్ రిజిస్ట్రార్ కృష్ణప్రసాద్, దాదాపు 30 మంది ట్రైనీ జాయింట్ కలెక్టర్ లు పాల్గొన్నారు.

## వైఎస్సార్ బీమాతో ధీమా

మధురానగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ బీమాతో పేద కుటుంబాలకు ధీమా కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ 32వ డివిజన్ ఇన్‌చార్జి గుండే సుందర్‌పాల్ అన్నారు. 32వ డివిజన్‌కు చెందిన ఎ.నాగరాజు ఆకస్మికంగా మృతి చెందిన ఆయన కుటుంబానికి గురువారం వైఎస్సార్ బీమా నగదును వార్డు సచివాలయం సిబ్బందితో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా సుందర్‌పాల్ మాట్లాడుతూ నాగరాజు కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా రూ.10 వేలు అందజేస్తున్నామని, మిగిలిన మొత్తం త్వరలోనే వారి బ్యాంక్ ఖాతాలో జమవుతుందని వివరించారు. అనంతరం నాగరాజు కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

## సీఎంపై విమర్శలు చేస్తే సహించేది లేదు

**పవన్ వ్యాఖ్యలను ఖండించిన ఎస్సీ కమిషన్ సభ్యుడు బసవరావు**



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ కమిషన్ సభ్యుడు బసవరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ చేసిన విమర్శలను రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు కె.బసవరావు తీవ్రంగా ఖండించారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రికి పోలీసులు, పోలీసు వ్యవస్థపైన అపార గౌరవం ఉందన్నారు. పోలీసు శాఖలో దిగువ స్థాయి కానిస్టేబుల్, చివరికి హోంగార్డును సైతం గౌరవించే సంస్కారం ఆయనదని పేర్కొన్నారు. సీఎం వద్దకు కానిస్టేబుల్ వెళ్లినా గౌరవిస్తారన్నారు. సామాన్య కానిస్టేబుల్ అయిన తనను ఎస్సీ కమిషన్ సభ్యుడిగా నియమించారని, సీఐగా పని చేస్తున్న గోరంట్ల మాధవ్‌కు ఎంపీగా అవకాశం కల్పించారని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రికి డీజీపీ సెల్యూట్ చేయడాన్ని పవన్ కల్యాణ్ తప్పుబట్టడం సిగ్గుచేటన్నారు. పవన్ క్యారెక్టర్ ఏమిటో తనకు బాగా తెలుసని, అవసరమైతే రాష్ట్ర వ్యాప్తంగా తిరిగి ప్రజలకు వివరిస్తానని చెప్పారు. ప్రాణభయం ఉందంటున్న పవన్ కల్యాణ్ పాకిస్తాన్, చైనాతో ఏమైనా యుద్ధం చేస్తున్నాడా అంటూ ఎద్దేవా చేశారు.

## తీసుకున్న ఫోన్ ఇవ్వాలని అడిగినందుకు దాడి

మధురానగర్(విజయవాడసెంట్రల్): తన ఫోన్‌ను తిరిగి ఇవ్వాలని కోరిన వ్యక్తిపై జరిగిన దాడి ఘటనపై గురువారం అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. అజిత్‌సింగ్‌నగర్ పైపులరోడ్డు ప్రాంతానికి చెందిన పి.విఘ్నేశ్వరరావు వీఎంసీ మలేరియా విభాగంలో పనిచేస్తున్నారు. ఆయన బుధవారం రాత్రి తనకు తెలిసిన నవీన్‌కుమార్‌తో కలిసి పైపులరోడ్డులోని ఓ మద్యం దుకాణంలో మద్యం తాగారు. రాత్రి 11 గంటలకు విఘ్నేశ్వరరావు ఫోన్‌ను నవీన్‌కుమార్ తీసుకుని మాట్లాడుకుంటూ వెళ్లిపోయాడు. దీంతో విఘ్నేశ్వరరావు తన స్నేహితుడు అంబటి ప్రసాద్‌ను తీసుకుని నవీన్‌కుమార్ ఇంటికి వెళ్లి ఫోన్ ఇవ్వాలని అడిగారు. తాను ఫోన్ తీసుకోలేదంటూ విఘ్నేశ్వరరావుతో నవీన్‌కుమార్ గొడవ పడ్డారు. పక్కనే ఉన్న స్క్రాప్ దుకాణంలోని గాజు సీసాతో విఘ్నేశ్వరరావు తలపై కొట్టాడు. గాయపడిన విఘ్నేశ్వరరావు ఆర్ఎంపీ వద్ద చికిత్స చేయించుకుని గురువారం అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి

పాయకాపురం(విజయవాడరూరల్): బాలికలు, మహిళల రక్షణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన దిశ యాప్‌ను విద్యార్థినులు తమ మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని 281, 282 సచివాలయాల మహిళా సంరక్షణ కార్యదర్శులు జాస్పర్, కృష్ణ కుమారి సూచించారు. కండ్రిక కాలనీలో టీవీ సుబ్బారెడ్డి వీఎంసీ హై స్కూల్‌లో తొమ్మిదో తరగతి విద్యార్థులకు దిశ యాప్, చైల్డ్‌లైన్ 1098, ఎమర్జెన్సీ ఫోన్ నంబర్లు 100, 101, 108పై గురువారం అవగాహన కల్పించారు. ఆపద సమయంలో ఆత్మ రక్షణ కోసం దిశ యాప్‌ను ఎలా ఉపయోగించుకోవాలో వివరించారు.

## రోడ్డు ప్రమాదంపై ఫిర్యాదు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ద్విచక్రవాహనంపై వెళ్తున్న వ్యక్తిని ఓ లారీ వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. గత నెల 28వ తేదీన జరిగిన ఈ ప్రమాదంపై గుణదల పోలీస్ స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. పెదపులిపాకకు చెందిన పేకేటి రమేష్(58) ప్రైవేట్ ఉద్యోగి. ఆయన గతనెల 28న బీఆర్‌టీఎస్ రోడ్డు సమీపంలో ద్విచక్రవాహనంపై వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన లారీ ఢీ కొట్టింది. దీంతో రమేష్ గాయపడి ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు. ఈ ప్రమాదంపై గురువారం గుణదల పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.